క్లుప్తంగా

రాజీ యోగ్యమైన కేసుల్లో మధ్యవర్తిత్వం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): ప్రతిరోజూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో రాజీ యోగ్యమైన కేసులలో మధ్యవర్తిత్వం చేస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాదు అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ప్యానెల్ న్యాయవాదులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాదు మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన కక్షిదారులకు నియమించిన ఉచిత న్యాయవాదులు పనితీరు, కేసుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.

చట్టాలపై అవగాహన అవసరం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దేశంలో మహిళలు, బాలికలు, యువతుల రక్షణ కోసం అమలు చేస్తున్న చట్టాలపై విద్యార్థినిలు పూర్తిగా అవగాహన పెంచుకోవాలని ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సీతారామారావు సూచించారు. స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాలలో ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్, విమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, కామర్స్ డిపార్ట్‌మెంట్, ఐక్యూఏసీ విభాగాల ఆధ్వర్యంలో సెక్సువల్ హెరాస్మెంట్ యాక్ట్ -2013పై మంగళవారం ఆయన అతిథి ఉపన్యాసం ఇచ్చారు. ఈ సందర్భంగా పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీతారామ రావు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పీఎస్‌వీ మునీశ్వర రావు, మాస్టర్ ట్రైనర్ పి.రత్న రాజు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను కలిసిన నాయకులు



శ్రీధర్‌తో కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

ఏలూరు (టూటౌన్): జిల్లాలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త, నాయకుడూ కృషి చేయాలని మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ పిలుపు నిచ్చారు. ఏలూరులోని మాజీ ఎంపీ కోటగిరి నివాసంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర, జిల్లా నాయకులు మంగళవారం కలిశారు.ఈ సందర్భంగా ఏలూరు పార్లమెంట్ పరిధిలోని పార్టీ పరిస్థితులను గురించి కొద్దిసేపు ముచ్చటించారు. శ్రీధర్‌ను కలిసిన వారిలో వైఎస్సార్ పీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదుగురు సూర్యనారాయణ,రాష్ట్ర కార్యదర్శి మేడూరి రంగబాబు, దెందులూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు నిట్టా గంగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకలు మిడతా రమేష్,కాలేషా తదితరులు ఉన్నారు.

రవీంద్ర కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): ఆయిల్‌పామ్ కార్మికుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందనీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ విమర్శించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టి.నరసాపురం మండలం జగ్గవరం గ్రామానికి చెందిన కొమ్ము ప్రభాకర్ కుమారుడు కొమ్ము రవీంద్ర ఆయిల్‌పామ్ గెలలు నరుకుతుండగా విద్యుత్ షాక్‌తో ఇటీవల చనిపోయారని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో పునరావృతం అవుతున్నా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం దుర్మార్గమని విమర్శించారు. చనిపోయిన రవీంద్ర కుటుంబ నష్టపరిహారం ఫ్యాక్టరీ నుంచి పది లక్షల రూపాయలు, కరెంటు డిపార్టుమెంట్ నుంచి పది లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వానాకాలం.. వ్యాధుల భయం

- డెంగీ, చికున్‌గున్యాతో ప్రమాదం
- దోమలకు ఆవాసాలుగా ఏలూరు, వట్లూరు ప్రాంతాలు



లంబాడీపేటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం (ఫైల్)

ఏలూరు టౌన్: గత వారం రోజులుగా వర్షాలు దంచికొడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాణాంతకమైన డెంగీ, చికున్‌గున్యా తోపాటు మలేరియా, టైఫాయిడ్ విషజ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు చెబుతున్నారు. జోరుగా వర్షాలు కురుస్తోన్న నేపథ్యంలో దోమలు విజృంభించే అవకాశాలు అధికంగా ఉంటాయని పేర్కొంటున్నారు. ముఖ్యంగా జాతీయ డెంగీ మాసోత్సవంలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ మలేరియా నివారణ అధికారులు ఏలూరు నగరంలో విస్తృతంగా ప్రజలకు విష జ్వరాలపై అవగాహన కల్పిస్తున్నారు. మూడు రోజులకు పైబడి జ్వరం ఉంటే తక్షణమే వైద్యుని సంప్రదించాలని చెబుతున్నారు. వర్షపు నీరు నిల్వ లేకుండా ఇంటి పరసరాలను సైతం పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని పేర్కొంటున్నారు. ఇంటి బయట, లోపల మంచినీటి నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలనీ, మంచినీటిలో డెంగీ కారక దోమలు ఉత్పత్తి అవుతాయని వైద్యులు సూచిస్తున్నారు. జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఏలూరు మలేరియా అధికారి జీ.గోవిందరావు, ఆరోగ్యసిబ్బందితో ప్రజలకు డెంగీ దోమల వ్యాప్తిపై అవగాహన కల్పిస్తున్నారు.

ఏలూరులో డెంగీ కేసులు అధికం

వర్షాకాలంలో విజృంభించే డెంగీ వ్యాధి అటు ఏజెన్సీతో పాటు ఏలూరు నగరంలో అధికంగా కేసులు నమోదు కావటం గమనార్హం. ఇక చికెన్ గున్యా వ్యాధితోనూ రోగులు తీవ్ర అనారోగ్యంతో బాధపడే పరిస్థితి ఉంది. గత కొన్నేల్లుగా డెంగీ కేసుల గణాంకాలను పరిశీలిస్తే ఏలూరు నగరం, వట్లూరు గ్రామంలో డెంగీ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నట్లు తెలుస్తోంది. ప్రజలు ఇంటి పరిసరాల్లో మంచినీటి నిల్వలను పరిశుభ్రం చేసుకోవాల్సిన అవసరం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఏలూరు, వట్లూరు, టి.నరసాపురం, లింగపాలెం, చింతలపూడి, బుట్టాయగూడెం, ఏలేరుపాడు తదితర ప్రాంతాల్లో డెంగీ దోమలు తమ ప్రభావాన్ని చూపిస్తున్నాయి. ఏలూరు నగరంలో బీడీకాలనీ, లంబాడీపేట, ఇజ్రాయేల్‌పేట, తంగెళ్ళమూడి, వన్‌టౌన్ ప్రాంతంలోని కొన్ని ఏరియాల్లో డెంగీ దోమలు ఎక్కువగా పెరుగుతున్నట్లు ఆరోగ్య సిబ్బంది సర్వేలో వెల్లడైంది.

ఏలూరు పరిసర ప్రాంతాల్లో డెంగీ కేసులు ఇలా

2020	35
2021	89
2022	137
2023	97
2024	69
2025	7

ఏడిస్ ఈజిప్ట్ దోమతో డేంజర్

ఏడిస్ ఈజిప్ట్ దోమలతో అత్యంత ప్రమాదకరమైన డెంగీ వ్యాధి ప్రబలుతుంది. మంచినీటి నిల్వల్లో మాత్రమే పెరిగే ఈ ఆడ ఏడిస్ ఈజిప్ట్ దోమకాటు పట్ల ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. ఈ జాతి దోమ పైన నల్లని, తెల్లని చారలు ఉండడంతో ఈ దోమలను టైగర్ దోమలు అని కూడా పిలుస్తారు. ఈ దోమలు ఇంటిలోపల, ఆవరణలో ఉంటూ పగటి వేళల్లో మాత్రమే మనిషిని కాటు వేస్తాయి. అన్ని రకాల దోమల కంటే డెంగీ దోమ బరువుగా ఉండడంతో 400 మీటర్ల కంటే ఎక్కువ దూరం ఎగరలేని స్థితిలో ఉంటాయి. దోమలోనే కాకుండా దోమ గుడ్లలోనూ వైరస్ ఉంటుంది. ఈ డెంగీదోమలు కేవలం మంచినీటి నిల్వలో మాత్రమే గుడ్లు పెడుతూ విస్తృంగా పెరుగుతాయి.

డెంగీ వ్యాధి లక్షణాలు

- ఆకస్మికంగా తీవ్రమైన జ్వరం, తలనొప్పి, విపరీతమైన కండరాలు, కీళ్ల నొప్పులు.
- కంటి నొప్పులు, కంటి కదలిక తగ్గటం, కదిలినప్పుడు నొప్పి ఉంటుంది.

విషజ్వరాలపై జాగ్రత్తగా ఉండాలి



దోమల వృద్ధిని అరికట్టేందుకు ప్రతీ ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత, ఇంటిలోనూ పరిశుభ్రత పాటించాలి. వర్షాకాలంలో వర్షపునీరు నిల్వ ఉండడం, ఇంటి పరిసరాల్లోనూ మంచినీటి నిల్వలు ఉండడంతో డెంగీ కారక దోమలు వృద్ధి చెందుతాయి. వర్షాకాలంలో సహజంగానే విషజ్వరాలు విజృంభిస్తూ ఉంటాయి. ఈ నేపథ్యంలో ప్రజలు విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. – డాక్టర్ ట్వింకిల్, యూపీహెచ్‌సీ వైద్యాధికారి, లంబాడీపేట

- ఒక్కో సారి శరీరంలో ఎర్రటి దద్దుర్లు, చిగుళ్ళ నుంచి రక్తస్రావం ఉంటాయి
- అధికం దాహం, నోరు తడారిపోవటం వంటి లక్షణాలు సైతం ఉంటాయి.
- డెంగీ వ్యాధిలో ముఖ్యంగా మూడు రకాలుగా వైద్యులు చెబుతున్నారు. డెంగీ జ్వరం, డెంగీ హేమరేజ్ జ్వరం, డెంగీ షాక్‌సిండ్రోమ్‌గా ఉంటాయి
- డెంగీ దోమకాటు అనంతరం 3 నుంచి 14 రోజుల్లో వ్యాధి లక్షణాలు బయటపడతాయి.
- డెంగీ వ్యాధి సోకిన అనంతరం సాధారణంగా 80 శాతం మందికి దానంతట అదే తగ్గిపోతుంది.
- వ్యాధి తీవ్రతతో రక్తంలోని ప్లేట్‌లెట్స్ తగ్గిపోయి ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది.
- వ్యాధి తీవ్రతను తెలుసుకునేందుకు మాక్ ఎలీసా పరీక్షలు చేయించుకోవాలి. గర్భిణులు, చిన్నపిల్లలు, దీర్ఘకాలిక వ్యాధి బాధితులు డెంగీ వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

ఘనంగా టాటా జయంతి

ఏలూరు(ఆర్ఆర్‌పేట): విద్యార్థులు కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్ ఉంటుందని తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. మంగళవారం తపన ఫౌండేషన్ కార్యాలయంలో భారతరత్న జేఆర్‌డీ టాటా జయంతి గనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్ఆర్ కాలేజీ ఎంబీఏ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఎంబీఏ విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం టాటా సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీఆర్ ఆర్ కాలేజీ ఎంబీఏ హెచ్ఓడీ కేవీ శ్రీధర్, ఈవెంట్ కోఆర్డినేటర్స్ ఎస్. సతీష్, ఈ. కవిత పాల్గొన్నారు.

సంవత్సరం తర్వాత ఉచిత బస్సు పథకమా?



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యులు

దెందులూరు: ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి ప్రభుత్వ ఏర్పడిన తర్వాత పట్టించుకోకపోవడంపై ఏలూరు జెడ్పీటీసీ సభ్యురాలు మండల సరస్వతి, దెందులూరు జెడ్పీటీసీ సభ్యురాలు నిట్టా లీలా నవకాంతం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏలూరు రూరల్ మండలం శ్రీపరులో వారు విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన సంవత్సరం తర్వాత ఉచిత బస్సు సౌకర్యం పథకాన్ని అమలు చేస్తాననడం ఏంటి?అని ప్రశ్నించారు. మహిళలకు నెలకు రూ.1500 ఇస్తానన్న హామీ ఎప్పటి నుంచి అమలు చేస్తారు? అని ప్రశ్నించారు. హామీలను అమలు చేయకపోవడంతో సంవత్సరంలోపే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిందని మండిపడ్డారు.

పీ–4తో హామీలకు ఎగనామం



రీకాలింగ్ బాబూస్ మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ ప్లకార్డులను ప్రదర్శిస్తున్న నాయకులు



47,48వ డివిజన్‌లో మాట్లాడుతున్న నాయకులు

మామిళ్ళపల్లి జయప్రకాష్

ఏలూరు టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేక చేతులెత్తేసిందని, హామీలకు ఎగనామం పెట్టేందుకు పీ-4 ప్రోగ్రామ్ పేరుతో డ్రామా చేస్తోందని వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్ విమర్శించారు. నగరంలో మంగళవారం రాత్రి నాలుగు డివిజన్లలో బాబు షూరిటీ -మోసం గ్యారెంటీ కార్యక్రమాలు నిర్వహించారు. ఏలూరు వన్‌టౌన్ 18వ డివిజన్‌లో కార్పొరేటర్ ఇనపనూరి కేదారేశ్వరి, పార్టీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షులు ఇనపనూరి జగదీష్ ఆధ్వర్యంలో, 47, 48వ డివిజన్లలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు నెరుసు చిరంజీవి, ఇందిరమ్మ ఆధ్వర్యంలో, ఏలూరు 29వ డివిజన్‌లో జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్‌గురునాథ్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా రీకాలింగ్ బాబూస్ మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్లకార్డులను పార్టీ నేతలు, కార్యకర్తలు, మహిళలు ప్రదర్శించారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఇవ్వకుండా ఏవిధంగా మోసం చేశారో వివరించారు. ఈ సందర్భంగా ఏలూరు సమన్వయకర్త జేపీ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రజలను మరోసారి మభ్యపెడుతూ పీ4 ప్రోగ్రామ్ పేరుతో బురిడీ కొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఘంటా రాజేశ్వరరావు, ఇనపనూరి సురేష్, పెద్దిరాజు, బట్టు విజయలక్ష్మి, రేష్మ, వెంకటేష్, మణికంఠ, శ్రీనివాస్, విక్టర్, గణేష్, సత్యనారాయణ, కొండపల్లి పరమేశ్వరరావు, జలీల్, కృష్ణ, అట్బాడ రామకృష్ణ, నౌషాద్, ఖాజా, కరీముల్లా, ఉష, అక్బర్, ఉత్తరాల శ్రీను, రూబినా, తూతిక వాసు, సంతోష్, వెంకటరావు, సన్నీ, తోటకూరి కిషోర్, రంగారావు, కట్టంపూడి అనురాధ, ఏలూరు నగర అధ్యక్షులు గుడిదేశి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్‌రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏలూరు నగర మహిళా అధ్యక్షురాలు జిజ్జువరపు విజయనిర్మల, నగర బీసీ సెల్ అధ్యక్షులు కిలాడి దుర్గారావు, ఎస్సీ సెల్ నగర అధ్యక్షులు ఇనపనూరి జగదీష్, కొల్లిపాక సురేష్, కార్పొరేటర్ తుమరాడ స్రవంతి, మట్టా రాజు, తులసీ, మేతర సురేష్, దాలి వెంకటేష్, బండ్లమూడి సునీల్, యక్కల నాని, బసవ, సత్యనారాయణ, ఘంటా సాయి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల గ్రంథాలయాల్లో పుస్తకాలు అందుబాటులో ఉంచాలి



సుబ్బమ్మ దేవి స్కూల్‌లో గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రభుత్వ పాఠశాలల్లోని గ్రంథాలయాలలో విద్యతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించేలా పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక రామచంద్రరావు పేటలోని ఈదర సుబ్బమ్మదేవి నగరపాలక హైస్కూల్‌ని మంగళవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి, పాఠశాలలో విద్యాబోధన, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని గ్రంథాలయాన్ని, విద్యార్థులకు అందులో అందుబాటులో ఉంచిన పుస్తకాలను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట సమగ్ర శిక్ష ఏపీసీ పంకజ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుటుంబరావు తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు ఒన్‌టౌన్‌లోని వెంకన్న చెరువు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో కొత్త విద్యుత్ లైన్లు నిర్మిస్తున్న నేపథ్యంలో బుధవారం నగరంలోని వివిధప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేఎం అంబేద్కర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మేరకు నగరంలోని ప్రేమాలయం రోడ్, పెదమాలపల్లి, తూర్పువీధి, గంగానమ్మగుడి ఏరియా, ఫిల్ హౌస్ పేట, చాటపర్రు రోడ్, సాయిబాబా గుడి ప్రాంతం, శివాలయం ఏరియా పరిసర ప్రాంతాలలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు తెలిపారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

ఏలూరు టౌన్: పట్టణంలోని చోడిదిబ్బ ప్రాంతానికి చెందిన దాసరి రోషన్ (13) ఈ నెల 28న రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి కనిపించలేదు. దీంతో తల్లిదండ్రులు వెంటనే ఏలూరు టూటౌన్ సీఐ అశోక్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేయగా బాలుడు గిద్దలూరు ప్రాంతంలో ఉన్నట్లు సమాచారం రావటంతో సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో హెడ్‌కానిస్టేబుల్ కె.సత్యనారాయణ గిద్దలూరు వెళ్లిబాలుడ్ని సురక్షితంగా ఏలూరు తీసుకువచ్చారు. అనంతరం బాలుడ్ని తల్లికి అప్పగించారు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలనీ, పిల్లలు కనిపించకపోతే వెంటనే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

సైబర్ నేరాలపై అవగాహన

భీమడోలు: బాల బాలికలు, యువత సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని హెచ్ఎం డాక్టర్ పీవీకేడీ ప్రసాద్ అన్నారు. పూళ్ల పంచాయతీ శివారు ఎంఎం పురంలో మంగళవారం విద్యార్థులకు సైబర్ నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాల నిరోధక చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఫ్యాక్టరీని వెంటనే ప్రారంభించి పనులు కల్పించాలి



జేసీఎల్‌కు వినతి పత్రం అందజేస్తున్న గౌతమీ ఫ్యాక్టరీ కార్మికులు, ఇఫ్టూ నాయకులు

ఏలూరు (టూటౌన్): జీతాలుపెంచడంతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత నాలుగు నెలలుగా శాంతియుత పద్ధతుల్లో ఆందోళన చేస్తున్నప్పటికీ యాజమాన్యం స్పందించకపోవడంతో సోమవారం వంగూరూ గౌతమీ ఫ్యాక్టరీ కార్మికులు ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. దీంతో కక్షగట్టిన యాజమాన్యం గేటుకు తాళం వేసింది. యాజమాన్యం చర్యను వ్యతిరేకిస్తూ మంగళవారం కార్మికులు ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కంద్రిక గూడెం సెంటర్ నుండి ప్రదర్శనగా బయలుదేరి అశోక్ నగర్ వంతెన మీదుగా లేబర్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ గంట సేపు ధర్నా నిర్వహించారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎ.రాణికి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆమె స్పందించి, వెంటనే మేనేజ్మెంట్ తో ఫోన్లో సంప్రదించారు. వెంటనే గేటుకు తాళం తీసి కార్మికులందరికీ పనులు కల్పించాలని స్పష్టం చేశారు. అనంతరం కార్మికులు ఊరేగింపుగా చాణక్యపురి కాలనీలోని పరిశ్రమల శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కార్యాలయాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించారు. ఫ్యాక్టరీల చట్టం ప్రకారం ఉండవలసిన సౌకర్యాలు లేవంటూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యు.వెంకటేశ్వరరావు, బద్దా వెంకట్రావు, పద్మావతి, ఎం.ఆలీసమ్మ, రంగమ్మ, రాణి, సత్యవతి, బేబీ, అనసూయ, సావిత్రి పాల్గొన్నారు.

పాఠశాలలకు కాంపోజిట్ గ్రాంట్స్ జమ చేయాలి



ఎస్ఎస్ఏ ఏపీసీకి వినతిపత్రం సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఖాతాలకు కాంపోజిట్ గ్రాంట్స్ జమచేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ ఏలూరు జిల్లా శాఖ ప్రతినిధులు సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ కే. పంకజ్ కుమార్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలకు కాంపోజిట్ గ్రాంట్స్ జమకాకపోవడం వల్ల పాఠశాల నిర్వహణ ప్రధానోపాధ్యాయులకు భారంగా మారిందన్నారు. అలాగే ఇటీవల ప్రభుత్వ యాజమాన్యంలో విలీనమైన ఎయిడెడ్ పాఠశాలలకు కూడా కాంపోజిట్ గ్రాంట్స్ విడుదల చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వినతిపత్రం సమర్పించి వారిలో ఏపీటీఎఫ జిల్లా అధ్యక్షుడు తాళ్ళూరి రామారావు, ఏలూరు రూరల్ మండల ప్రధాన కార్యదర్శి టీ. శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కోటేశ్వర రావు ఉన్నారు.

జిల్లాలో బాడీ బిల్డింగ్‌కు పునర్వైభవం తెస్తాం



దుర్గా ప్రసాద్ దొరను అభినందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో బాడీ బిల్డింగ్‌కు పునర్వైభవం తీసుకురావడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని న్యూ ఆంధ్రా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి బొరగం దుర్గా ప్రసాద్ దొర తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయం కపర్ది భవనంలో అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఖాసిం మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో బాడీ బిల్డింగ్‌కు యువకుల నుంచి మంచి స్పందన ఉందన్నారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా శాఖకు బొరగం దుర్గా ప్రసాద్ దొరను కార్యదర్శిగా ఎంపిక చేసినట్టు ప్రకటించారు. ఏలూరు జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన దొరను అసోసియేషన ప్రతినిధులు, పలువురు బాడీ బిల్డర్లు ప్రత్యేకంగా అభినందించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	32
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	34
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	32
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	09
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో 22సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	24
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	31
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	18
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	31
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	26
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	30
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

కొత్త పింఛన్లు అందించాలని ధర్నా

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారికి సంక్షేమ పింఛన్లు విడుదల చేయాలని ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద దళిత సేన ఆధ్వర్యంలో మంగళవారం భారీ ధర్నా చేశారు. ఈ సందర్భంగా దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షులు జిజ్జువరపు రవి ప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అర్హులైన వారికి సంక్షేమ పింఛన్లు అయిన వృద్ధాప్య ,వితంతు, డప్పు కళాకారుల, చెప్పులు కుట్టే చర్మకారు, దివ్యాంగులు పెన్షన్ లు వెంటనే విడుదల చేయాలని రవి ప్రకాష్ డిమాండ్ చేశారు. అనంతరం సందర్భంగా జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డికి వినతి పత్రం అందజేసారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా దళిత సేన మహిళా అధ్యక్షురాలు బేతాలు జయసుధ, పశ్చిమగోదావరి జిల్లా దళిత సేన అధ్యక్షులు చీలి మోహనరావు, ఏలూరు జిల్లా దళిత సేన వర్కింగ్ ప్రెసిడెంట్ స్టాలిన్, తూర్పుగోదావరి జిల్లా దళిత సేన గౌరవాధ్యక్షులు దొండపాటి మాణిక్యాలరావు, ఏలూరు జిల్లా దళిత సేన ప్రధాన కార్యదర్శి లక్క పాము చంటి పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో ప్రజల వెతలు



చీకట్లో ఏలూరు జీజీహెచ్ మెయిన్ రోడ్డు



కొవ్వొత్తుల వెలుగులో చిరువ్యాపారులు

నగరంలో అప్రకటిత విద్యుత్ కోతలు మొదలయ్యాయి. గత మూడు రోజులు నుంచి రాత్రిపగలూ తేడా లేకుండా గంటలకొద్దీ విద్యుత్ కోతలతో నగర ప్రజలు అల్లాడుతున్నారు. కరెంటు పోయిందని సమాచారం కోసం ఫోన్ చేసినా స్పందించని పరిస్థితి. ఏలూరు నగరంలోని కొత్తపేట, నూకాలమ్మ గుడి సెంటర్, ఏకే సెంటర్, గాంధీనగర్, చేపల తూము సెంటర్, సుబ్బమ్మదేవి స్కూల్ సెంటర్, జీజీహెచ్ ప్రాంతాల్లో కరెంటు లేక ఇబ్బందులుపడుతున్నారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్/ ఏలూరు



చీకట్లో ఏలూరు గాంధీనగర్ సెంటర్



ఏలూరు చేపల తూము సెంటర్‌లో ఇలా